సాక్షి తిరుపతి

శుక్రవారం। 10। నవంబర్। 2023



వేదకాల వైద్యం ఆయుర్వేదం

వేదకాలంలోనే ఆయుర్వేదం ప్రాచుర్యం పొందింది . మూలికల మందులతో అన్ని వ్యాధులు నయం చేయవచ్చు.

- 2లో



అమ్మ సేవకు వేళాయే

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది. నేడు ధ్వజారోహణం జరగనుంది.



గురుకుల విద్యార్థులకు అస్వస్థత

ఓజిలి మండలం వాకాటివారిపల్లె గురుకులంలో విద్యార్థులు వాంతులతో అస్వస్థతకు గురయ్యారు.

- 2లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,157 మంది స్వామివారిని దర్శించుకోగా, 24,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అన్న ప్రసాదం కాంప్లెక్స్‌లో ఆయుధ పూజ



హారతి ఇస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో గురువారం ఆయుధ పూజ వేడుకగా జరిగింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు. ముందుగా వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీపద్మావతి, శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నప్రసాదం డెప్యూటీ ఈవో రాజేంద్ర, కల్యాణకట్ట డెప్యూటీ ఈవో సెల్వం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, విజీవో నందకిషోర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శ్రీశాస్త్రి, ఏఈవో శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది, క్యాటరింగ్ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష మందుల వితరణ



మందులను అందజేస్తున్న దుకాణాల నిర్వాహకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి పట్టణానికి చెందిన మేఘ మెడి నీడ్స్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే మందులను వితరణగా అందజేశారు. వీటిని ఈవో సాగర్‌బాబు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. దుకాణాల నిర్వాహకులు కార్తీక్‌రెడ్డి, కొండూరు నంద, మునిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సుస్థిరాభివృద్ధి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ బాలాజీ

తిరుపతి అర్బన్: సుస్థిరాభివృద్ధికి అన్ని విభాగాలకు చెందిన అధికారులు సమిష్టిగా పని చేద్దామని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధిపై కలెక్టర్, జేసీలతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ బాలాజీ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం జేసీ జిల్లా అధికారులతో సమావేశయ్యారు. భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో గోడౌన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలను పాడి రైతులకు కూడా సక్రమంగా అందాలని తెలిపారు. జగనన్న లేఅవుట్లలో ఇంటి పట్టాలు పొందిన ప్రతి ఒక్కరు నిర్మాణాలు వందశాతం పూర్తి చేసేలా సహకరించాలన్నారు. పంచాయతీ రాజ్ పరిధిలోని భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను వందశాతం కల్పించాలని స్పష్టం చేశారు. డీఆర్వో పెంచల కిషోర్, డెప్యూటీ కలెక్టర్ భవానీశంకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్, బీసీ సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నడి సంద్రంలో వేటాడుతున్న జాలర్లు



జీవన సంద్రం

బతుకుదెరువు కోసం ప్రాణాలనే పణంగా పెడతారు. చూస్తేనే భయమేసే సముద్రాన్నే తమ జీవనయానానికి ఆదరువుగా మలుచుకుంటారు. కుటుంబాలను వదిలి కారుచీకట్లోనే కడలిపైకి వేటకు బయలుదేరుతారు. ఉవ్వెత్తున ఎగసిపడే అలలను అలవోకగా దాటుకుంటూ మత్స్య సంపద కోసం అన్వేషణ మొదలుపెడతారు. అదృష్ట దేవత వరిస్తే సంతోషంతో ఉప్పొంగిపోతారు. దురదృష్టం వెంటాడితే కన్నీటి కడలితో కుమిలిపోతారు. అనుకోని ఉపద్రవం వస్తే ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటాన్ని కొనసాగిస్తారు. తమ కులదైవంపైనే భారమేసి క్షణమొక యుగంలా గడుపుతూ తీరానికి చేరుకుంటారు. అప్పటిదాకా తమరాక కోసం ఎదురుచూసిన కుటుంబ సభ్యులను చూసి కళ్లల్లో సుడులు తిరుగుతున్న ఆనందబాష్పాలతో హత్తుకుని ఎగిరిగంతేస్తారు. బతుకు పోరాటంలో గంగపుత్రుల జీవన శైలిపై ఓసారి లుక్కేద్దాం!

- మత్స్యకారుల జీవనశైలి విభిన్నం
- వేట విరామంలో ఊరంతా సందడి
- వైఎస్సార్‌సీపీ హయాంలో పెరిగిన మత్స్యకారుల జీవన ప్రమాణాలు
- బిడ్డల చదువులపై శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు

సాక్షి, తిరుపతి డెస్క్: తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పరిధిలో 12 మండలాలు ఉండగా.. వాటి పరిధిలో 169 కి.మీ.మేర సముద్ర తీరం ఉంది. ఆ తీరం వెంబడి ఉన్న 98 గ్రామాల్లో సుమారు 1.5 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 41 వేల మంది చేపల వేటనే జీవనాధారంగా మార్చుకున్నారు. ఏటా దాదాపు 65 వేల టన్నుల మత్స్య సంపదను సముద్రం నుంచి సేకరిస్తున్నారు. గంగపుత్రుల జీవన శైలి విభిన్నం.. సాహసోపేతంగా ఉంటోంది. గ్రామ పెద్దల కనుసన్నల్లో కట్టుబాట్లను ఆచరిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. కష్టాన్నే నమ్ముకుని కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. అర్ధరాత్రి నుంచి వీరి దినచర్యను ప్రారంభిస్తారు. వేకువ జామున 2 గంటలకే సిద్ధం చేసుకున్న వలలను భుజాన వేసుకుని సంప్రదాయ బోట్ల ద్వారా సముద్రంలోకి వెళ్తారు. దాదాపు 5 కి.మీ.సముద్రంలోకి వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం తీరానికి చేరుకుంటారు. మెకనైజ్డ్ బోట్లు ఉన్న మత్స్యకారులు మాత్రం సముద్రంలో వారం పాటు ఉండి మత్స్య సంపదను సేకరించి వస్తారు. ఇలా పది నెలల పాటు ఎన్నో ఆటుపోట్లతో కుటుంబాలను పోషించుకుంటారు. పగలంతా తమ వలలను సరిచేసుకుని మళ్లీ మరుసటి రోజుకు సన్నద్ధమవుతారు. కుటుంబ సభ్యులతో గడిపేది చాలా తక్కువ. ఇలా ఏడాదిలో పది నెలలు సముద్రంలోనే వీరి జీవితం గడిచిపోతుంది.



వేటకు బయలుదేరుతూ..

దురాయి.. ఎంతో మేలోయి!

మత్స్యకారులు కులాల కుంపట్లకు.. రాజకీయాలకు దూరం. అందరిదీ ఒక్కటే మాట.. బాట. ఒక్క మాటలో చెప్పాలంటే.. తమకు తాముగా విధించుకున్న కట్టుబాట్లకు కట్టుబానిసలు. తప్పొప్పులు జరిగితే పరిష్కరించేందుకు వీరు పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కేది తక్కువ. వీరికి వీరు సృష్టించుకున్న చట్టం పేరు 'దురాయి'. ఈ చట్టం కట్టుబాటును ఎవరూ ధిక్కరించరు. పెద్ద కాపు, నడింకాపు, చిన్నకాపు.. ఇలా ఊరిలో ముగ్గురిని గ్రామ పెద్దలుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. వీరు చెప్పిందే వేదం. చేసిన తప్పులకు వీరే శిక్ష వేస్తారు. ఎవరైనా ఈ నిర్ణయాన్ని ధిక్కరిస్తే.. అందరికీ ఆమోదయోగ్యంగా 'దురాయి' విధిస్తారు. తమకు మంచిచేసే వారి కోసం ప్రాణాలైనా ఇచ్చేస్తారు. తమకు అన్యాయం చేస్తే అందరూ ఒక్కటవుతారు. వీరిలో దైవభక్తి కూడా ఎక్కువే.

వేటకు విరామం.. బతుకు పోరాటం

వేట విరామ సమయంలో మత్స్యకారులు కాయకష్టాన్నే నమ్ముకుంటారు. కొంతమంది అందుబాటులో ఉన్న ఆక్వా కల్చర్‌లో కూలిపనులకు వెళ్లగా మరికొందరు రొయ్యల చెరువుల్లో పనిచేయడం, ప్యాకింగ్ చేయడం, ఇతరత్రా పనులకు వెళ్తారు. ఆయా పనులు దొరకని పక్షంలో కాలక్షేపం కోసం చింతబెత్తలతో ఆట, పులీమేక, కబడ్డీ ఆడుతుంటారు. వేసవిలో చెట్ల నీడలోనే ఎక్కువ సమయం గడుపుతారు. మహిళలైతే ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు.



బతుకు 'వేట'

గ్రామంలో మత్స్యకారులు బోటు సామర్థ్యాన్ని బట్టి యూనిట్‌గా ఏర్పాటవుతారు. పెద్దబోటులో (మూడు ఇంజిన్లు) 30 మంది, సింగిల్ ఇంజిన్ ఉన్న బోటులో నలుగురు వెళ్తారు. డబుల్ ఇంజిన్ ఉన్న బోటులో 20 మందికి పైగా వేటకు వెళ్తారు. వారు సేకరించే మత్స్య సంపదను అందరూ కలిసి పంచుకుంటారు. ఒకసారి వేటకు వెళ్తే బోటు డీజిల్ ఇతరత్రా రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. ఆయా బోట్లు, వలలు మరమ్మతులకు గురైతే ఆ యూనిట్‌లో ఉన్న వారందరూ కలిసి అప్పులు చేసి బాగు చేయించుకుంటారు. అవసరమైతే గ్రామం మొత్తం మీద అప్పు తెచ్చుకుంటారు.



నాలుగున్నరేళ్లలో ఎంతో మార్పు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల జీవితాల్లో పెనుమార్పులు సంభవించాయి. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ సామాజిక పింఛన్, డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ రీయింబర్స్‌మెంట్‌తో పాటు వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత.. ఇలా ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హతగల కుటుంబాలన్నింటికీ ఎలాంటి వివక్ష లేకుండా అందజేస్తోంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల పునరుత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వేటకు విరామం ప్రకటిస్తూ, నిషేధం విధించింది. ఆ సమయంలో జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. అదే గతంలో అయితే అరకొర మందికి.. అదీ ఏడాదికి రూ.4 వేలు ఆర్థిక సాయం, 20 కేజీల బియ్యం ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.10 లక్షలు పరిహారం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.3.3 లక్షల విలువైన బోటు, మోటార్లు, వలలు రాయితీపై అందిస్తోంది. మెకనైజ్డ్ బోట్ల పంపిణీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేస్తోంది.

ఈ ప్రభుత్వంలో జీవనం సుభిక్షం



గతంలో మత్స్యకార భరోసా సకాలంలో రాక జీవనానికి మావాళ్లు నానా అవస్థలు పడేవారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద బీమా కూడా అందక చాలా కుటుంబాలు వీధిన పడ్డాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు భరోసా దొరికింది. అనేక పనిముట్లపై రాయితీలు ఇచ్చింది. సకాలంలో వేట విరామం నగదు, డీజిల్‌పై సబ్సిడీ, బోట్లపై 90 శాతం రాయితీలు తదితర సంక్షేమ పథకాలతో మత్స్యకారుల జీవనం సుభిక్షంగా ఉంది.

– వాటంగారి వెంకట్రమణయ్య, మత్స్యకార సంఘం నాయకుడు, వైస్ ఎంపీపీ, తూపిలిపాళెం



వేట ముగించుకుని ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు

ఆ సమయంలో చాలా భయమేసింది



ఎనిమిదేళ్ల కిందట వచ్చిన హుద్‌హుద్ తుపాన్ సమయంలో నేను మరో నలుగురు మత్స్యకారులతో కలిసి 20 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంపై వేట సాగిస్తున్నాం. ఆ సమయంలో ఒక్కసారిగా సముద్రంలో ఏర్పడిన సుడులతో చాలా భయాందోళన చెందాం. త్వరగా ఒడ్డుకు చేరుకోవాలని అధికారులు, మత్స్యకార కాపులు ఫోన్లు చేసి సూచించారు. కానీ ఎటూ కదలలేక తిరగబడుతున్న బోట్లతో వణికిపోయాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చాలా సేపు గడిపాం. ఇకచేసేది లేక మా ఇష్ట దైవాన్ని తలచుకుంటూ ఎలాగోల ఒడ్డుకు చేరుకున్నాడు.

– కొండూరు సోమయ్య, తూపిలిపాళెం

చేపల వేట తప్ప మరేపనీ తెలియదు



నేను గత 25 ఏళ్ల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళుతున్నాను. ఈ వృత్తి మా తాతల తరాల నుంచి వస్తోంది. నాకు వేరే పని తెలియదు. మేం ప్రతిరోజు అర్ధరాత్రి సమయంలో భార్య, పిల్లలను వదిలేసి సముద్రంలోకి వెళ్లి రోజంతా గాలించి తెచ్చిన మత్స్య సంపదతో పొట్టపోసుకుంటున్నాం. ఎక్కువ మోతాదులో మత్స్య సంపద దొరికినప్పుడు గ్రామ కట్టుబాట్లకు అనుగుణంగా వేలం ద్వారా పొరుగు రాష్ట్రాల వ్యాపారులకు విక్రయిస్తాం. వచ్చిన మొత్తాన్ని 5 మంది మత్స్యకారులు సమానంగా తీసుకుంటాం. అయితే ఒక్కోసారి నెల రోజులైనా సముద్రంపై గాలించినప్పటికీ చేపలు దొరక్క పస్తులు ఉండాల్సి వస్తుంది.

– ఎం.పోలయ్య, కొండూరుపాళెం గ్రామం

మాటకు కట్టుబడి ఉంటాం



సముద్రంపై ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదురొడ్డి వేట చేయడం సంప్రదాయ మత్స్యకారుల లక్ష్యం. మేమంతా గ్రామ కట్టుబాట్లకు లోబడి ఉంటాం. గ్రామంలో ఎంత పెద్ద సమస్య తలెత్తినా పోలీస్‌స్టేషన్‌కు పోకుండా గ్రామ పెద్దల ద్వారానే పరిష్కరించుకుంటాం. ఈ ఆనవాయితీ తరతరాల నుంచి వస్తోంది. గ్రామ కట్టుబాట్లను ధిక్కరించిన వారిని అపరాధ రుసుం విధించి మందలిస్తాం. చేపల వేటలో ఎదైనా సమస్య ఉంటే వెంటనే గ్రామంలో దురాయి విధిస్తాం. దానిని అందరూ తప్పక పాటించాల్సిందే.

– ఆర్కేటి గోపాలయ్య, మాజీ పెద్ద కాపు, తూపిలిపాళెం.

ఆ సమయంలో దిక్కుతోచదు



మా ఆయన అర్ధరాత్రి సమయంలో నన్ను, మా పిల్లల్ని వదిలి చేపలవేటకు సముద్రంలోకి వెళతారు. ఆ సమయంలో నేను సముద్రం ఒడ్డు వరకు వెళ్లి సాగనంపి వస్తాను. పిల్లల్ని బడికి పంపిన తర్వాత మధ్యాహ్నం సముద్రం ఒడ్డుకు చేరుకుంటాం. ఒక్కోసారి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటే మాకు దిక్కుతోచదు. ఆయన వచ్చేంత వరకు ఎదురుచూస్తుంటాం. క్షేమంగా రావాలని మా కుల దైవాన్ని ప్రార్థిస్తుంటాం.

– రజిత, తూపిలిపాళెం



మత్స్య సంపదను చూపుతున్న జాలరి



చేపల విక్రయానికి బయలుదేరుతున్న మత్స్యకార కుటుంబ సభ్యులు



ఎండబెట్టిన చేపలు

మరింత సంక్షేమానికి జగనన్నే సీఎం కావాలి

- చంద్రబాబు పాలనలో తిరుపతికి రూ. 50కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి
- జగనన్న పాలనలో ఒక సచివాలయ పరిధిలోనే రూ.14.44కోట్లతో అభివృద్ధి పనులు
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి, జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత సంక్షేమం అందిస్తారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 3వ సచివాలయం వద్ద నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' అన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూమన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లల్లో దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు చేయలేనంతగా సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి పేదవాడి ఇంటి ముంగిటికే జగనన్న పథకాలు చేరుతున్నాయన్నారు. గత చంద్రబాబు పాలనలో తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి కేవలం రూ.50 కోట్లు కూడ ఖర్చు చేయలేదని స్పష్టం చేశారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని 3వ సచివాలయ పరిధిలో ఒక్క చోటే రూ.14.44కోట్లు అభివృద్ధికి ఖర్చు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. తిరుపతి నగరాభివృద్ధి, సంక్షేమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబుకు పోలిక లేదని ప్రశ్నించారు. ఇప్పటికే తిరుపతి అభివృద్ధికి జగనన్న రూ. 1,700కోట్లు ఖర్చు చేశామని సగర్వంగా చెప్పారు. ఒక తిరుపతి నగరంలోని 26వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చిన గొప్ప నాయకుడు జగనన్న అని చెబుతున్నామన్నారు. పేదలపై జగనన్నకు ఉన్న నిబద్ధతకు ఇది ఒక నిదర్శనమని తెలిపారు. పెత్తందారుల పక్కన కాకుండా పేదల పక్షాన నిలబడే నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్రంలో రూ. 3.38లక్షల కోట్లు సంక్షేమం రూపంలో పేదలకు అందించినట్లు తెలిపారు. జగనన్నను గెలిపించుకుంటే సంక్షేమం రెండింతలుగా పొందవచ్చన్నారు. కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సురేంద్రరెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల మాక్ పోలింగ్ పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌లో ఈవీఎంల మాక్‌పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఇందులో పోల్ చేసిన ఓట్లు సరిగా నమోదవుతున్నాయా..? లేదా..? అని పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాక్ పోలింగ్ పారదర్శకమైన ఓటింగ్ ప్రక్రియ కోసమేనని తెలిపారు. నోడల్ అధికారి కోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు వాయిదా

తిరుపతి కల్చరల్: స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ విభాగంలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణ కోసం వైద్యులు, సిబ్బంది, వివిధ కేటగిరి కాంట్రాక్ట్ పోస్టులకు ఈ నెల 9,10వ తేదీల్లో నిర్వహించాల్సిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలను పరిపాలనాపరమైన కారణాలతో వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీలను స్విమ్స్ వెబ్‌సైట్ ద్వారా త్వరలోనే ప్రకటిస్తామని, అభ్యర్థులు గుర్తించాలని పేర్కొన్నారు.



క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ఆర్థిక సాయం అందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మండలంలోని చియ్య వరంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో లక్ష్మమ్మకు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి గుడిసెలో మంటలు రేగాయి. స్థానికులు గమనించి అదుపు చేసేలోపు పూర్తిగా దగ్ధమైంది. రూ. లక్ష వరకు నష్టం వాటిల్లింది. బాధితురాలు కట్టుబట్టలతో వీధిన పడింది. సమాచా రం అందుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి బాధితురాలికి తక్షణ సాయంగా రూ.10 వేల నగదును, బస్తా బియ్యాన్ని అందజేశారు. పవిత్రారెడ్డి మాట్లాడుతూ పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

ఓజిలి: మండలంలోని వాకాటివారికండ్రిగలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో గురువారం 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం విద్యార్థులు అల్పాహారం తీసుకుని తరగతి గదులకు వెళ్లారు. కొంతసేపటికి వాంతులు చేసుకుంటూ బయటకు వచ్చారు. కడుపునొప్పితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రిన్సిపల్ రజనీకుమారి విద్యార్థులను ఓజిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. 12 మంది విద్యార్థులు నీరసంగా ఉండడంతో సెలైన్లు ఎక్కించి, మిగిలిన వారికి మందులు అందించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్ రూ.16లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతి నెహ్రూ నగర్‌లోని రియల్ ఎస్టేట్ బ్రోకర్ ఎస్.ఎం.ఇస్మాయిల్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.16 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్లు ఆయన తరపు న్యాయవాది వి.లక్ష్మన్న తెలిపారు. 2015 నుంచి అతను రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా వ్యాపారం చేస్తూ వచ్చాడు. వ్యాపారం కోసం ఇతరుల వద్ద సొమ్మును అప్పుగా వడ్డీలకు తీసుకున్నాడు. అనారోగ్యంతో పాటు వ్యాపారంలో నష్టాలు రావడంతో రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
PRO (Public Relation Officer) (Education), Salary : 10,000/-
manasamskruthi@gmail.com
మన సంస్కృతి
7396049947

దక్కిలి: డీ.వడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండాను అవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



బ్రోచర్‌ను ఆవిష్క రిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



సీఎం జగనన్నతోనే అభివృద్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యేలు వరప్రసాద్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడులో గురువారం 'ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. ప్రజల నుంచి అశేష స్పందన లభించింది.



చిల్లకూరు: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



సత్యవేడు: సంక్షేమ బావుటా బ్రోచర్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వేదకాల వైద్యం ఆయుర్వేదం



ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుత వైద్యం ఆయుర్వేదం. వేదాల కాలం నాటి ఈ వైద్య విధానం భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందింది. క్షీరసాగర మథనం జరిగినప్పుడు లక్ష్మీదేవి, చంద్రుడు, ఇంద్రుడు, వాయుదేవుడితోపాటు భగవాన్ ధన్వంతరి ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజునే ధన్వంతరి జయంతిని అనాదిగా జరుపుకుంటున్నారు. దీంతో నవంబర్ 10వ తేదీన ప్రభుత్వం జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యంపై ప్రత్యేక కథనం.

- దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే అవకాశం
- నేడు ఆయుర్వేద దినోత్సవం

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. అందులో 4 ఎన్ఆర్‌హెచ్ఎం కింద పనిచేస్తున్నాయి. 21 డాక్టర్లు, 35 మంది సిబ్బంది పనిచేస్తున్నాయి. 30 రకాల ఆయుర్వేద మందులు ఉన్నాయి. మరో వంద



ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

రకాల మందులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వైద్యశాలలకు నిత్యం 600 మంది వస్తుంటారు. ప్రధానంగా వృద్ధులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

పలు రకాల వ్యాధులకు చికిత్స

ప్రస్తుతం వస్తున్న అన్ని రకాల జబ్బులకు వేద కాలంలోనే చికిత్సలు ఉన్నట్లు ఆయుర్వేదం చెబుతుంది. ప్రస్తుత వైద్య విధానాన్ని ఎనిమిది విభాగాలు విభజించారు. ఇందులో కాయచికిత్స(జనరల్ మెడిసిన్), బాలచికిత్స (ప్రసూతి, స్త్రీరోగ, బాలరోగ)లకు సంబంధించింది. గ్రహ చికిత్స(వైరాలజీ–యాంటిబాయటిక్స్), ఉర్ధ్వా చికిత్స(తల, మెడ), శల్యచికిత్స(సర్జరీ), దంష్ట్ర(పాము, తేలు, పురుగులకు), జర చికిత్స(ముసలితనంలో వచ్చే రోగాలకు), రసాయన చికిత్స(ఇమ్యూనాలజీ) మంచి ఫలితాలిచ్చాయి.

పంచకర్మ ప్రసిద్ధి

ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్స విధానం ఓ విశిష్ఠ చికిత్స పద్ధతి అని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. మందులకు లొంగని మొండి వ్యాధులకు పంచకర్మ ఒక అద్భుత చికిత్స. వ్యాధిని మూలం నుంచి తీసి వేయడానికి ఈ చికిత్స విధానం తోడ్పడుతుంది. ఇందులో ఉండే ఐదు పద్ధతులు ఇవే. స్నేహనము, స్వేదనము, వయనము, విరేచనము, వస్తి ఇందులో స్నేహనము, స్వేదనములను పూర్వ కర్మలు అంటారు. శరీరంలో ఉన్న మలినాలన్నింటినీ దారిలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుంది. మిగతా మూడు నోటి ద్వారా, విరేచనం ద్వారా జబ్బులను తొలగించడానికి వేస్తారు.

తగ్గిన ఆదరణ

బ్రిటీషుల రాకతో భారతదేశంలో అల్లోపతి మందుల వాడకం పెరిగింది. ఆంగ్లీయుల సైనికులకు గాయాలైనప్పుడు వారికి త్వరగా నయమయ్యేందుకు ఇంగ్లీష్ మందులను ఉపయోగించారు. దీంతో మన దేశంలో ప్రజలు వారిలాగే త్వరగా నయం కావాలని రోజువారీ జబ్బులైన తలనొప్పి, జలుబు, జ్వరం తదితర వాటికి ఇంగ్లీష్ మందులను వినియోగిస్తున్నారు. ఈ విధంగా ఆంగ్లీయుల రాకతో ఆయుర్వేద వైద్యాన్ని భారతీయులకు అంటగట్టి బలవంతులను బలహీనులుగా మార్చారని పూర్వీకుల వాదన. అయితే అల్లోపతి మందులతో దుష్పరిణామాలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు వెలుగులోకి తేవడంతో ప్రజలు మళ్లీ ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి చూపుతున్నారు.

ఆయుర్వేదంతో ఆయుష్..



సూర్యోదయానికి ముందే నిద్రలేవాలి. సూర్యాస్తమయంలోగా భుజించడం పూర్తి కావాలి. పరిమితంగా తినాలి. శారీరకశ్రమ తప్పనిసరిగా ఉండాలి. ఇది ఆయుర్వేదం చెప్పే జీవన విధానం. ఈ తరహా జీవనశైలిని అనుసరిస్తే వీటిలో అత్యధిక శాతం జబ్బులు అసలు రాకుండానే నివారించవచ్చు. నైట్‌లైఫ్ బాగా పెరగడం వల్ల, నిద్రలేమి, విపరీతమైన ఒత్తిడి, తద్వారా హార్మోన్ల అసమతౌల్యం వంటివి రోగాలకు కారణమవుతున్నాయి. దీనిని వెంటనే సరిచేసుకోవాలి.

– శేఖర్‌రాజు, సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి, చిత్తూరు

అన్ని రోగాలకు మందులు

ఆయుర్వేదంలో అన్ని రోగాలకు మందులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సంతాన సాఫల్యత, ఆడ, మగ హార్మోన్ అసమానతలు, కడుపు నొప్పి, రొమ్ములో గడ్డలు, మెనోపాజ్ తదితర స్త్రీల వ్యాధులకు, బీపీ, సుగర్, కిడ్నీలో రాళ్లు, అసిడిటీ, గ్యాస్ట్రబుల్, అజీర్ణం, మలబద్ధత, ఫైల్స్, ఫిషర్స్, సయాటికా, నడుము నొప్పి, కీళ్ల వాతం, చిన్న పిల్లలకు, గర్భిణులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మందులు ఉన్నాయి. ప్రస్తుతం మనం ఉపయోగించే వంటకాల్లో ఎన్నో మూలికలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆవాలు, జీలకర్ర, మిరియాలు, ధనియాలు, ఇంగువా, శొంఠిలో ఎన్నో ఔషధ మూలికలు ఉన్నట్లు ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వీటిని ఉపయోగించి ఒక్కో జబ్బుకు ఒక్కో రకం మూలికను ఉపయోగించి మందులను తయారు చేస్తున్నారు. రోగులు జబ్బు వచ్చిన తర్వాత మొదటి సారిగా ఆయుర్వేద వైద్యులను కలిస్తే ఉపయోగంగా ఉంటుంది. అయితే అల్లోపతి, హోమియోపతి ద్వారా చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోతే, అప్పుడు ఆయుర్వేదాన్ని ఆశ్రయిస్తున్నారు.

వెల్లువెత్తిన అభిమానం



వేద పండితుల ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, హర్షిత్‌రెడ్డి

- ఎమ్మెల్యే చెవిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- జిల్లా వ్యాప్తంగా కదలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి రూరల్: చంద్రగిరి ప్రజల అభిమాన నాయకుడు, జనం మెచ్చిన నేత, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయన స్వగ్రామం తుమ్మలగుంట వేలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు, అధికారుల రాకతో కిక్కిరిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా భారీగా తరలి వచ్చిన పార్టీ నేతలు, అభిమానులు, కుటుంబ సభ్యుల నడుమ ఎమ్మెల్యే చెవిరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. గజ మాలలతో ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఆయా కాలనీల వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, మహిళా, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, దళిత సంఘాల నేతలు సన్మానించారు. పుష్పగుచ్ఛాలు, శాలువలకు బదులుగా పూల మొక్కలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగులను అందించారు. చెవిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు చెవిరెడ్డి నివాస ప్రాంగణం జన సందడిగా మారింది. శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు, అభిమానులు శ్రేయోభిలాషులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనం, స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రముఖుల శుభాభినందనలు

పుట్టినరోజు సందర్భంగా కుటుంబసమేతంగా తన గురువర్యులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులను కుటుంబసమేతంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కలిశారు. భూమన ఆశీర్వచనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ వ్యాప్తంగా...

ఎమ్మెల్యే చెవిరెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద 25 కేజీల కేక్, పాకాలలో 50 కేజీల కేక్ కట్ చేశారు. అలాగే రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు.



శుభాభినందనలు చెబుతున్న భూమన దంపతులు



శుభాకాంక్షలు చెబుతున్న తిరుపతి రూరల్ మండల నాయకులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

HOUSE FOR SALE
తిరుపతి, చెర్లోపల్లి సర్కిల్ మెయిన్ రోడ్డుకు అతి దగ్గరగా శ్రీవారి నగర్ ప్లాట్లలో G+2 పడమర ముఖం గల కొత్తగా నిర్మించిన ఇల్లు అమ్మకానికి కలదు. లోన్ సౌకర్యము కలదు. 9705568777, 9491772546.

PLOT FOR SALE
3,60,000 లకే ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు దివ్యా గార్డన్‌లో డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్, సంప్ర : 9502774175, 7995992114.

తిరుపతి–ఏర్పేడు to వెంకటగిరి హైవే రోడ్డుకు దగ్గరగా IISER వెళ్లే దారిలో రోడ్డుకు అనుకొని గేటెడ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్స్‌తో Tuda అప్రూవల్స్‌తో పూర్తి 100% రెసిడెన్షియల్, కమర్షియల్, ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ఈ దీపావళి పండగ సందర్భంగా Plot అగ్రిమెంట్ చేసుకున్న వారికి ప్రత్యేక ఆఫర్ కలదు. 9505502346.

హైదరాబాద్ to షాద్‌నగర్ మధ్యలో బెంగళూర్ హైవేకి అతి దగ్గరలో HMDA, DTCP అప్రూవల్ అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్స్ తక్కువ ధరలో 10K to 17K. బ్యాంక్ లోన్ avlb. Ph : 9090886887

Services

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820.

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. దార్విన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924008.

BUSINESS SERVICE

BUSINESS OFFER
Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9398743067

Wanted

క్రొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో 28 మంది స్త్రీ/పురుషు ఉద్యోగాలు.జీ.1400+DA 8000+ప్రీరూం, అ:7th to డిగ్రీ P/F ,సిందూ ప్రమోషన్స్,K.K లేబెల్,తిరుపతి. 9182593225.

మా Office నందు Field Work చేయుటకు 10th చదివిన నమ్మకమైన Persons కావలెను. జీతం: 12–15 వేలు. (Work from Home చేయుటకు Ladies-2 Urgent). 9848625575.

Urgent Requirement Field Executives in HDFC Bank Collections Department Tirupati Location. Contact: 9014339051, 6302114143,.

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926

రామకృష్ణ గ్రూపు. (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 92814 52828, 6281208656

విజయవాడలో ఇంటి దగ్గరే ఉండి పేషెంట్లను చూసుకొనుటకు మెడికల్ అనుభవం ఉన్న M/F కేర్‌టేకర్ / నర్సులు కావలెను. రూమ్ + భోజనం + మంచి జీతం. 91608 35559, 78158 35561

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640468899, 9640258899

హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు భోజనం, బస్ పాస్ ఫ్రీ జీతం రూ. 12,000 నుండి 20,000. Ph: 9676950291, 8340028105

కష్టపడేవారు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయు వారు RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000–40000/– ఫ్రీ రూమ్+భోజనం. Hyd 7993583999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలనగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



శ్రీవైజయంతిలో దీపావళి ఆఫర్లు

నెల్లూరు(బృందావనం): దీపావళి పండగ సందర్భంగా శ్రీవైజయంతి ఎలక్ట్రానిక్స్‌లో కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నట్లు ఆ షోరూం అధినేతలు ఎల్ నిరంజన్‌రెడ్డి, ఎల్‌టీ రామిరెడ్డి తెలిపారు. నెల్లూరులోని వైజయంతి ఎలక్ట్రానిక్స్‌లో ఎల్‌జీ కంపెనీ రిఫ్రిజిరేటర్ కొనుగోలు చేసిన కస్టమర్ నరేష్ రూ.5 లక్షల విలువైన గృహోపకరణాలను గెలుపొందారు. గురువారం షోరూమ్‌లో నరేష్‌కు ఎల్‌జీ కంపెనీ రీజినల్ మేనేజర్ కృష్ణాజీ, బ్రాంచి మేనేజర్ రామమనోహర్ గృహోపకరణాలు అందజేశారు. నిరంజన్‌రెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తమ షోరూంలో కస్టమర్లకు హ్యాట్‌ట్రిక్ ఆఫర్‌కింద ప్రతి కొనుగోలుపై స్క్రాచ్ కార్డు ద్వారా రూ.10వేలు వరకు క్యాష్‌బ్యాక్, విలువైన బ్రాండెడ్ గృహోపకరణాలు అందజేస్తున్నామని తెలిపారు. బంపర్ లక్కీడ్రా ద్వారా బుల్లెట్, ఎలక్ట్రిక్ బైక్, ఐఫోన్ వంటి బహుమతులు అందజేస్తున్నామని వివరించారు. అన్ని ప్రముఖ కంపెనీల గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్లతో పాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు. బజాజ్, హెచ్‌డీబీఐ, ఐడీఎఫ్‌సీ వంటి ఫైనాన్స్ కంపెనీల ద్వారా ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా రూ.4 లక్షల వరకు వడ్డీలేని ఈఎంఐ ఫైనాన్స్ అందిస్తున్నామని వివరించారు. నెల్లూరు, కావలి, తిరుపతి, చిత్తూరు, మదనపల్లిలోని తమ షోరూమ్‌లలో ఈ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు.



నరేష్‌కు రూ.5లక్షల గృహోపకరణాలు ఇస్తున్న ఎల్‌జీ కంపెనీ ఆర్ఎం కృష్ణాజీ,శ్రీవైజయంతి అధినేత రామిరెడ్డి

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

రాపూరు: రాపూరు–తెగచర్ల మార్గ మధ్యంలో బస్ షెల్టర్ వెనుక గురువారం అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా, సంగం మండలం చెర్లోవంగల్లు గ్రామానికి చెందిన కోదండరామిరెడ్డి (58) బుధవారం పెంచలకోన దైవ దర్శనానికి మోటారు బైక్‌లో బయలుదేరాడు. దర్శనానంతరం స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే పెంచలకోన–తెగచర్ల మార్గమధ్యంలోని బస్‌షెల్టర్ వెనుక విగతజీవుడై పడి ఉన్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. లభించిన ఆధార్‌కార్డులోని వివరాల మేరకు కోదండరామిరెడ్డిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రాపూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

గురుకుల ప్రిన్సిపల్ సస్పెన్షన్

ఓజిలి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను గుంటూరు ఏపీఆర్ఈఐ సొసైటీ కార్యదర్శి ఆర్.నరసింహరావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చిలమానుచేను బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఏపీఆర్ఈఐ సొసైటీ కార్యదర్శితోపాటుగా మరో నలుగురు సిబ్బంది మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రిన్సిపల్ అనంతయ్య నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందడంతో తనిఖీలు జరిగాయి. ప్రిన్సిపల్ గదిలో కాల్చి పడేసిన సిగరెట్లు అధిక మోతాదులో ఉండడాన్ని బృందం గుర్తించింది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కొంతమందిని ఇటీవల తొలగించారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నా, వారితోనే విధులు నిర్వహి స్తుండడం నిర్లక్ష్యానికి అద్దంపట్టింది. సిబ్బందికి గదులు కేటాయించే సమయంలో అనుమతులు తీసుకోకపోవడం, జూలై నెలలో విద్యార్థులకు బార్బర్ పనులు చేసినట్లు నిధులు మంజూరుకు బిల్లు పెట్టారు. విద్యార్థులతో చర్చించిన తర్వాత ఆ నెలలో బార్బర్ చేత పని జరగలేదని స్పష్టం అయ్యింది. పాఠశాలలో నిధులు వినియోగానికి సంబంధించి రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించలేదని నిర్ధారణ అయ్యింది. విద్యార్థులు పట్ల ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరి బాధ్యత రాహిత్యాన్ని చాటడడంతో సస్పెండ్ చేస్తూ నరసింహరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మూడు రోజుల పవిత్రోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాల్లో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం , అన్నప్రానాయానం నిర్వహించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అంతకుముందు వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, అర్చకులు నారాయణాచార్యుల చేతులమీదుగా ఆచార్య రుత్విక్‌వరణం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు.



స్వామి,అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

ఆర్జిత సేవగా పవిత్రోత్సవం

గృహస్తులు(ఇద్దరు) రూ.516 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. పవిత్రోత్సవాల నేపథ్యంలో గురువారం ఆర్జిత సేవలు రద్దు చేశారు. శుక్రవారం, శనివారం కూడా కల్యాణోత్సవం, తిరుప్పావడ సేవలు రద్దు చేసినట్లు ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కొండూరు క్రిష్ణమరాజు కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీలో చేరారు. క్రిష్ణంరాజు కుమారుడు దేవానంద్ రాజు, తమ్ముడు మధురాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారందరికీ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధురాజు, దేవానంద్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, మాజీ మండల అధ్యక్షుడు పాలపద్మనాభం, నాయకులు మోహన్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు క్రిష్ణం రాజు, దేవానంద్ రాజు, మధురాజు

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి క్రైం: ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, 12 దుంగలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ అబ్బన్న కథనం.. కపిల్ తీర్థం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే సమయంలో జూ పార్క్ వైపు నుంచి లీలామహల్ సర్కిల్ వైపు ఓ టవేరా వాహనం వేగంగా వచ్చింది. ఆ వాహనాన్ని వెంబడించి అదుపులోకి తీసుకోగా అందులో 12 ఎర్రచందనం దుంగలను గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఇందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారవ్వగా తమిళనాడుకు చెందిన వెంకటేశును అదుపులోకి తీసుకున్నామన్నారు. తలకోన ప్రాంతం నుంచి లోడ్ చేసుకుని చంద్రగిరి మీదుగా చెన్నైకి తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఎర్రచందనంతో పాటు టవేరా వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, పారిపోయిన నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.